# పెండ్లి పీట

శ్రీ బి. జీవనప్రభాత

" రాము! అప్పుడే నిద్రపట్టిందా? "

" ...................... "

" రాము! అబ్బ — నీది బండనిద్రోయ్— "

" ఏం బాబూ! పిల్చారా? "

" మరేఁ! "

" నిద్రపట్టింది ... "

" నీది బండనిద్ర ... అంత ఎలాగ పడుతుం దోయ్? ఒక చోటా? ఒకహాయా? కటికబల్ల మీద! ఏం సౌకర్యంగా వుందని? అంతనిద్ర! "

" అలానే పడుతుంది బాబూ— "

" నే నెంత ప్రయత్నించినా పట్టదు ... ఆతు రత అమితంగా వుండడంచేత ననుకుంటాను. "

" అంతే కాదండి — ఇటువంటిచోట అసలు అలవాటు లేకపోవడంమూలాన్ని కూడా— "

" నీకుమాత్రం మహా అలవా టేమిటి? "

" అలా క్కాదండి — రాత్రింబగళ్లు ఏగడ్డి మేటుచాటునో — ఏ బండరాతిమీదనో—నడుం వాలుస్తూనే వుంటూంటాంబాబు... "

" అబ్బ! ఈ పడవప్రయాణమంత పరమ ఛండాలం ఇంకోటి వుండదోయ్.—కాలినడక పుచ్చు కొంటే ఈపాటికి ఇల్లు చేరుకునేవాళ్లం. "

" మరి 'కారు' దాటిపోయింది కాబట్టికాని— ఈ అవస్థ పట్టకపోను— "

" ఇందాకటినుంచీ ఇక్కడాపేశారు—గంట యింది, ఒక్కడూ పికరడు... "

" అయితే లొల్ల చేరివుంటాం— "

" అబ్బ — ఇంకా పన్నెండు మైళ్ళు పోవాలి! ఈపాటికి మనింట్లో ఎంత కల్లోలంగా వుంటుందీ? ఇల్లంతా దీపాలతో వెలిగిపోతూ వుంటుంది! 'రామ డోలు' మేళం ఊరంతా మ్రోగిపోతూ వుంటుంది! ఇల్లంతా జనంతో కిటకిటలాడి పోతూవుంటుంది. అమ్మకు నాల్గుచేతులకూ సరిపడినపని వుంటుంది. చంటి చెల్లాయి హడావుడి ఇంతా అంతా కాదు — అత్తా, మామా, పిన్నీవాళ్లూ తప్పకుండా వస్తారు ... బాబయ్య రాడు, మామ్మని పంపనే నా పంపడు! ఏవంటావ్?... "

" ...................... "

" ఏవంటావ్ ? ... రాము! పంపుతా డంటావా? — — రాము! ... అబ్బ! అప్పుడే నిద్ర! "

" ఏం — బాబూ! "

" అబ్బ — నిద్ర పోతున్నావోయ్ ... అమ్మయ్య! మళ్లీ పడవ కదిలింది! ... ఎంత చీకటీ— ఈచీకటిని చూస్తోన్న కొద్దీ నాకూ వింత వింత ఊహాలు పరుగు లెడుతూ వుంటాయి. ఏవిఁటో పిచ్చి వూహాలనిపిస్తూ వుంటుంది! ... ఇందాకా నాకూ ఒక్క కునుకు పట్టిందోయ్. "

" నాకళ్లు మూసుగు పోతున్నాయ్ బాబూ! "

" నాకు పాడికళ్ళు పడిపోయాయి. నువ్వు ముందు కూర్చుందూ — ఇంకాస్తసేపటికి వెన్నెల వస్తుంది కదూ?... మళ్లీ నువ్వు కళ్ళు మూస్తున్నావు! ఇంక నీకూ నాకూ కుదరదు — "

" బాబూ! మెలుకువ తెచ్చుకొంటున్నాను — ఇంక నిద్రపోను లెండి. "

" ఇంకో రెండుగంటల్లో వెడతామా? "

" ఇంకా అయిదారు గంటలు పడుతుం దండి. "

" అప్పటికి చెల్లిమెడలో పుస్తె పడిపోతుంది. సూత్రధారణ మవుతూంటే ముద్దు చెల్లి ముఖం చూసే అదృష్టం నాకు లేదుకదా! తలంబ్రాలూ అయిపోతాయి — సదశ్యం కూడా అయిపోతుందేమో! పోనీ — ఆఖరికి పసుపుబట్టలతో వుండగా నేనా చూడగలుగుతామా? "

" మనం వెళ్లేటప్పటికి ఇంకా అమ్మాయిగారూ, అల్లుడుగారూ పెండ్లిపీటలమీద కూర్చునే వుంటారు— "

" చెల్లాయిని చూసి ఎంతకాల మయిందీ! ఈసంవత్సర మల్లా ఇంటికి దూరంగానే వున్నాను కదా— — అమ్మ నాకోసం ఎంత బెంగెట్టుకుందో — "

" మిమ్మలిని చూడ్డంతోటే ఆవిడ ఎగిరివచ్చి కౌగలించుకుంటారు — అసలు మీ వుత్తరం వస్తుందంటేనే వూరికే మాటి మాటికీ వీథిలోనికి వచ్చి తొంగి చూసి వెదుకూ వుంటారు!... ఇంక చెల్లాయిగారిమాట చెప్పక్కర్లేదు. "

" ఇందాకానేఁ— రామూ! ఒక్క కునుకు పట్టింది — చిన్నకల వచ్చింది. చెల్లి — బావా — ఇద్దరూ పెళ్లిపీటలమీద కూర్చుని వున్నారు. ఇంతట్లోనూ అక్కడికి నేను వెళ్లాను – చెల్లాయి నన్ను చూడ్డంతోటే ఒక్క యెగురున వచ్చి నా చేతుల్లో పడింది. పెళ్లిపీటలమీద తను కూర్చున్న సంగతే మరిచిపోయింది ...! జల జల కళ్ల నీళ్ళు కార్చింది– చెల్లాయిని చూసేసరికి నాగుండె నీ రయిపోయింది! " —

" చాలాకాలం అయింది కదండీ — ఒకర్నొకరు చూసుకుని — అందు మూలాన్నీ ఆవిడ కంటతడి బెట్టివుంటుంది... "

" కాని — ఎందుకో నా గుండె నీరయింది... బక్క చిక్కిన శరీరం – గుంటలు పడిన కళ్ళు — పాలిపోయిన ముఖం — కలిగి చెల్లి రూపు చాలా జాలికరంగా వుంది—చెల్లిని చూసి నేనూ ఏడ్చాను రామూ! "

" కేవలం కల! ఒకొక్కక్కసారి పైకే ఏడుస్తాం. మనం – అమితమయిన సంతోషంలో వున్నప్పుడు కూడా అంతే – ఎప్పుడూ ఒకర్నొకరు విడిచి వుండక వుండక వుంటే – సత్యహృదయాలు ఇలాగే దుఃఖిస్తాయి. "

" ఇంతట్లోనూ మెలుకువ వచ్చింది. కాని కళ్ల నీళ్ళు కారుతోనే వున్నాయి! నా శరీరం చల్లబడి వుంది — పైని మంచు కురుస్తుందేమో... శరీరంలో ఉత్సాహం ప్రవేశించింది. నన్ను నేను సంబాళించుకొన్నాను. నా స్థితి నాకే నవ్వువచ్చింది ... నిన్ను లేపాను — "

" ఏమిటో అలాగ ఒకొక్కక్క సారి మనస్సు పోతూవుంటుంది. దాన్ని లెక్క చెయ్యకూడదు. మీలో వుండే అద్భుత కలలను కలిగిస్తోంది. "

" అవును నిజమే — కాని రామూ! చెల్లి. బాగా ఆరోగ్యంగా వుందా? "

" ఆఁ— ఇంటిల్లిపాదీ కూడా క్షేమంగానే వున్నారు. తమను తప్పకుండా రమ్మన మని చెప్పమనీ — ఇంటిల్లిపాదీ క్షేమంగా వున్నారని చెప్పమనీ — పదే పదే చెపుతూ వీధిగుమ్మందాకా నన్ను సాగనంపారు అమ్మాయిగారు! ఆ క్రితం రోజునే అమ్మాయిని పెళ్లికూతుర్ని చేశారు — లక్ష్మీదేవి వచ్చి పీటల మీద కూర్చున్నదా అన్నట్లున్నారు– "

" బావ ఎలా గుంటాడో! "

" సరిగ్గా మీ అంత వుంటారు. మీకంటే ఇంకా పచ్చగానూ నాజూగ్గానూ వుంటారు — "

" అయితే చెల్లికి అన్నివిధాలా నచ్చిన సంబంధమేనా? "

" నాన్నగారు స్వయంగా అమ్మాయిని అడిగి కూడా తెలుసుకున్నారు. "

" అమ్మయ్యా! ... ఒక బాధ తీరినట్లయింది. ఎటువంటి మొగుడొస్తాడో — ఏమిటో అని ఇన్ని రోజులనుంచీ బెంగ పెట్టుకొని మరీ కూర్చున్నాను ... "

" నిజమేనండి మరి — "

" పెళ్లిపీటలమీద రతీమన్మథుల్లాగు వుంటా రన్నమాట! "

" ఆయన ఏదో చదువు కుంటున్నారు కూడ — "

" చదువుకున్నవాడే కావాలి ... ఎప్పుడు చూద్దునా అని ఉవ్విళ్లూరుతున్నాను. నా గుండెల్లో వున్న ఆరాటం నీకేం తెలుస్తుంది? ఎప్పుడు పందిట్లో పెళ్లి వాలతానా అని వుంది. "

" నిజమేనండి బాబూ — అలాగే వుంటుంది. అసలు అమ్మగారు మిమ్మల్ని నిన్నటికే తీసుకు రమ్మన్నారు — "

" మరి స్కూలుకి శలవు ఇవ్వొద్దూ? దానికి తోడు అక్కడ రైలు దాటిపోవడం — రాజమండ్రీలో స్టీమరు దాటుకు పోవడం — దానా దీనా ఒక రోజు ఆలశ్యం! ఇక్కడ కారు మించుకు పోయింది – అన్నీ అలాగే రానా? చెప్పు! "

" ఒక్కొక్కసారి అలాగే విరుచుకు పడుతూ వుంటాయండి. "

" పోనీ అన్నీ గడిచి సవ్యంగా వెళ్లడమేగొప్ప! తలంబ్రాలూ, సూత్రధారణా చూడక పోయినా — ఆఖరికి ఇద్దరూ పసుపుబట్టలతో వుండగానేనా చూస్తాంగదా — "

" ఆఁ— ఏమీపరవాలేదు. మనం వెళ్లినతర వాతకూడా ఇంకా బోలెడంత తదంగం వుంటుంది. "

" ఇంతకూ నాకు ఆశ్చర్యం ఏమిటంటే — ఇంత హఠాత్తుగా ఎలాగు సంబంధం కుదిరిందీ అని! — "

" కల్యాణం తోసుకు వచ్చిందండీ — ఏదో సంబంధం వచ్చింది. వచ్చి పిల్లను చూసుకొన్నారు. పిల్ల నచ్చింది. వీరికి పిల్లవాడు నచ్చాడు. అన్నీకుదిరాయి—మాటామంతీ,క్షణంలో అతుక్కుంది. శుభస్య శీఘ్రం అన్నారు. ముహూర్తం వారంరోజుల్లో కుదిరింది ... కల్యాణం ముందుకు తోసుకు వస్తూవుంటే రోజులుమాత్రం వెనక్కెందుకు వెడతాయి బాబూ? "

" నిజమే! ఇదివరలో అక్కయ్య పెళ్లికూడా ఈవిధంగానే తలవనితలంపుగా జరిగింది ... మామాటకేంగాని — నీమరదలిపెళ్లి ఎంతవిచిత్రంగా జరిగిందీ? "

" మాలో మాకే ఆశ్చర్యంగా వుంటాయండి.— ఈరోజుకి ఏహడావుడీ వుండదు. తెల్లవారేసరికి పెళ్లి సంబంధం వస్తుంది. మరోనిమిషానికి కుదురుతుంది. మధ్యాహ్నానికి తాంబూలాలు పుచ్చుకోడంతో పెళ్లి పనులు ప్రారంభం. రాత్రి పెళ్లి — తెల్లారగట్లతోటి పిల్లని సాగనంపడం! ... "

" నిజమే — నువ్వన్నట్లు కల్యాణం తనంతట తను రావాలి. లేకపోతే పేరయ్యగారిమూడో కూతురు చూడు — పదహారేళ్ళుంటాయి, కప్పి పుచ్చుకొంటున్నారు గాని — ఈపాటికి ముగ్గురు పిల్లల తల్లయ్యేది! "

" బాబూ! మంచిగాలి తగిలింది – తెరచాప ఎత్తుతారేమో— "

" సరంగులు లేవకొట్టే అందుకుముందు-మర్యాదాగా మనమే –లోపలి కెడదాం - పద."

" బాబూ! పడిచెక్క జారుతుంది–జాగ్రత్తగా దిగండి. "

" ఏం పరవా లేదు — "

" అబ్బ! హోలు కిక్కిరిసిపోయివుందండీ –"

" ఈ అమ్మోనియా బస్తాలమీద పడుకోవాలి కాబోల్రా దేవుడా! "

* * * *

" బాబూ! ఒక్కకునుకు తీద్దురూ! "

" ఇందాకటి నుంచీఅదేప్రయత్నం – నిద్ర దూరమయిపోయింది. మనసు పర్వులెడుతోంది! "

" దాన్ని కొంచెం కట్టి పారవేద్దురూ — "

" 'కట్టుగర్ర' కాని తాడుగాని కనపడడం లేదు! "

" అవి ఇక్కడే కనపడతాయి — మీరు వెదకరు గాని — "

" మనస్సు దొరకదు. విశ్వవిహారం చేస్తోంది. అనేక నీలితెరలు అడ్డువస్తున్నాయి. కారుమేఘాలు క్రమ్ముకుపోతున్నాయి ... ఈక్షణంలో ఆనందంలో ఈదులాడ వలసింది నీలాల నీటిలోకి జారిపో తున్నాను! "

" ఎందుచేత బాబూ? "

" ఏవేవో వేదాంత తత్వపుపాటలు జ్ఞప్తికి వస్తున్నాయి. "

" అంత రావలసిన అవసరం ఏంవచ్చింది? "

" అనేకకారణా లుంటాయి. మన యెదుట పరువెత్తే లోకంలో అనేక వింతముఖాలు, వింత రంగులతో కనపడతాయి. ఒక్కొక్క విషయం ఒక్కొక్క సమయంలో హృదయానికి హత్తుకు పోతుంది. దానివల్ల బాధ కలగవచ్చు — లేదా ఆనం దమూ కలగవచ్చు — "

" అంతవింతవిషయం మీకేంటికి — "

" ఆఁకనపడింది! ... ఇందాకా మనం రైల్లో వచ్చేటప్పుడు — జ్ఞాపక ముందా! మనముందు ఒక పదహారేళ్ల అమ్మాయీ — ఒకవిధవ — ఒక కుర్ర వాడూ కూర్చున్నారు? "

" ఆఁ—ఆఁ— జ్ఞాపకంలోనే వున్నారు; వారిని గురించి కొంత భోగట్టాకూడా చేశాను. "

" వాళ్ళు పుట్టెడు దుఃఖంలో మునిగివున్నట్లు తోస్తుంది, ఆవిధవావిడ ఆ యువతి తల్లీ అయి వుంటుంది. వారిద్దరికళ్లూ మాటిమాటికీ చెమ్మగిల్లు తున్నాయి. ఒకరిమొహం ఒకరు చూసుకోనేయందుకు భయపడిపోతున్నారు — ఒకరిని చూసుకొని ఒకరు దుఃఖిస్తున్నారు — లోలోన! "

" మీరన్నట్లు వారు నిజంగా పుట్టెడు దుఃఖ ములో వున్నారండి. ఆ అమ్మాయికి నిండా పది హేనేళ్లేనాలేవు. కాని పెద్దతుపాను మీదకు విరుచుకు పడింది! నెల్లాళ్లేనా కాలేదట పెళ్లయి! " ...

" అయ్యయ్యో! పాపం ...ఆమె గతేంకాను? ఆవయస్సులో అంతటి కష్టమే! ... అటువంటిదే ఏదోజరిగి వుంటుం దని అనుకున్నాను సుమా — ఈజరిగే దేదో నెల్లాళ్లక్రితమే జరిగితే బాగుండి పోయేది — "

" పెళ్లి నిశ్చయింపబడిం తర్వాత ఎప్పుడు జరిగినా వొకటే బాబూ ... మళ్లీ ఇంకో సంబంధం కూడా రాదు — ! "

" ఈ అమ్మాయిగతి అధోలోకంలోకిదించుకు పోయేదానికి బదులు ఆమె దించుకు పోయినా బాగుండిపోయివుండును — "

" ఆ మాటకూడా నిజమే! అమాత్రం దేవుడు కరుణించలేకపోయాడు. "

* * * *

" బాబూ! బాబూ! "

" ... ... ... "

" బాబూ! లేవండి ... వొచ్చాం! "

" ఏమిటీ? ఎక్కడికి? "

" వొచ్చేశాం బాబూ — మనవూరు...పడవ గట్టుకు పడుతున్నారు. మీరు నెమ్మదిగా దిగండి. సామాను పట్టుకొని నే దిగుతాను. "

" ... ... ... "

" పడిచెక్క మీదనుంచి జాగ్రత్తగా వుర కండిసుమా — "

" ... ... ... "

" ఈ చిన్న పెట్టె అందుకోండి ... "

" అమ్మయ్య! రామా! మనవూరు పొలి మేరకు వచ్చాం.ఇంక నాలుగడుగుల్లో ఎగిరివెళ్లాలి! "

" ఈ పెద్దపెట్టె నానెత్తిని పెట్టండి. "

" ఈ చిన్నది నే పట్టుకొస్తాన్లే...అమ్మయ్యా! వొళ్ళు హూనమయిపోయింది! "

" నా వెనక్కాలే రండి. దీపమేనా లేదు. ఈవెన్నెల ఒక్కటేదిక్కు! ముళ్ళు — జాగ్రత్త బాబూ — "

" ముళ్లూగిళ్లూ మన్నేమీ చెయ్యలేవు — గతుకుల్లో పడకుండా చూసుకొంటే సరి. "

" ఈ పుంతదారి తప్పితే వేరుమార్గం లేదు."

" ఇటువంటి విషయాలలో బోర్డువారు శ్రద్ధ తీసుకోరు ... ఇంతకంటే మా స్కూలు 'బ్లాక్ బోర్డు' మంచిది! "

" ఇలాగు తప్పుకు రండి. "

" దెయ్యాల చెట్టుకూడా దాటి పోయాం. ఇంకేమీ పరవాలేదు. మనం ఇంటి కొచ్చేశాం — ఇంక ఒక్క క్షణంలో మా అమ్మచేతుల్లో వుంటాను. చెల్లినీ బావనీ పెళ్లిపీటలమీద కూర్చుని వుండగా చూస్తాను ... నా చెల్లిని ఎంత దీవిస్తున్నానో! మంచి మంచి పద్యాలు చెల్లిని దీవిస్తూ రాశాను. అవి బావకి కట్నంగా చదివిస్తాను ... "

" బాబూ! మీరు పద్యాలు రాస్తారా? "

" ఆఁ—చాలా రాశాను. అమ్మమీదా, నాన్న గారిమీదా, అక్కమీదా, చెల్లిమీదా ... చెల్లి పెళ్లి మీదా కావలసినన్ని రాశాను. అవన్నీ ఈచిన్న పెట్టి లోనే వున్నాయి! ఇంకోసంగతి ఇంతవరకూ నీకు చెప్పనిది — ! "

" ఏవిఁటది బాబూ?"

" అయిదు రూపాయలు పెట్టి మంచిహారం కొన్నాను. "

" చెల్లెమ్మకి పెళ్లిబహుమతీ — "

" మరే — ఇంకో కర్పూరపు దండకూడా కొన్నాను. అది బావకి చెల్లిచేత వేయిస్తాను. ఈ హారం బావచేత చెల్లికి వేయిస్తాను. అప్పుడు పద్యాలు చదువు తాను. అప్పగింతల సమయంలో చెల్లితో వీటినికూడా అప్పగిస్తాను ... "

" అబ్బ! ఎంతవుత్సాహంతో నున్నారండి — "

" ఈ మళ్ళుపు తిరిగితే చింతతోపు వస్తుంది కదూ? "

" మీకు భయ మేస్తుందేమో? "

"ఇంకా నాకు భయమా? ఇంత పెద్దవాణ్నయ్యాను — ! ... ఇక్కడడుగు పెట్టే సరికి నాకు భయానికి బదులు మా తాతయ్య జ్ఞప్తికి వస్తాడు. ఎందరు పురాణపురుషులు ఈమట్టిలో తమ శరీరాలను ఐక్యం చేసుకున్నారో! ఎందరు మహానుభావులు ఈభూమిమీద నిశిరాత్రిళ్ళు సంచారం చేస్తూ వుంటారో! "

" ప్రయాణికుడైన ప్రతివాడూ గ్రామంలోనికి వెళ్లాలంటే ఈశ్మశానాలలోనుంచి నడవ్వలసిందే! కాలవ దగ్గిర్నుంచి మరి వేరుతోవ లేదు— "

" అంటే — దీన్ని బట్టి వేదాంతం తియ్య వచ్చు. మన జీవితంలో నిర్దిష్టప్రదేశాన్ని జేరేముందు శ్మశానాలలాటి భయంకర ప్రదేశాల నెన్నిటినైనా అతిక్రమించాలి. మార్గం కష్టతమం — ఇది తప్పితే వేరుదారి లేదు. "

" మీరు కవిత్వం చెపితేలాభంలేదు...త్వరగా నడక వేయాలి. "

" దూరాన్ని ఆదీపా లేవిఁటి? ఏదో అలికిడిగా వుందే! నిశిరాత్రి ఈరుద్రభూమిలో ఆదీపా లేవిఁటి?"

" బాబూ! మృత్యువుకు రాత్రింబగళ్ళుంటాయా ? సమయాసమయాలుంటాయా ? వీళ్లు బీద వాళ్లు — వాళ్లు మంచివాళ్ళు — వాళ్ళు అమాయకులు — అని ఆలోచిస్తుందా? "

"పాపం ఎవరో తమ ఆప్తుని కోల్పోయారు... అవిగో రోదనధ్వనులు— "

" ఒక చోట ఆనందం — ఒక చోట దుఃఖం! "

" ఇదీ లోకం — అనిపిస్తుంది! మనం పెళ్లి పీటల దగ్గిరికి వెడుతూ మృత్యుచర్యముందుగా చూడ వలసి వస్తోంది దీన్నిబట్టి మనం మళ్లీ వేదాంతతత్వం గ్రహిస్తున్నాం."

" ఏడుపులు హృదయాన్ని ఛేదించుకు వస్తున్నాయి. "

" మధ్యమధ్య ఒక కంఠం స్వరం మిన్ను ముట్టుతోంది — అది ఆ నిర్భాగ్య జీవి తల్లిదై వుండ వచ్చు - ఆయేడ్పులో మాతృవేదన కనపడుతోంది. "

" ఇంకా అనేకమంది దుఃఖిస్తున్నారు కాని ఎవరి ఏడ్పులూ అంతహృదయవిదారకంగా లేవు. "

" రామూ! ఎందుకో నా గుండెలు దడదడ మంటున్నాయి — ఆకంఠస్వరం చూడు. "

" ...... అయ్యో ! నా కూతురా...... "

" బాబూ! చనిపోతె ఎవరో స్త్రీయే! "

" ...... నీకు పన్నెండేళ్లకే నూరేళ్లూ నిండి పోయాయే కూతురా!......... "

"రామూ! పన్నెండేళ్లపిల్లట!"

"బాబూ! మనం అదిక్క చూడకుండా— ఇలా దూరాన్నుంచి తప్పుకొని వెళ్లిపోదాం, "

"రామూ ! నా హృదయంలో కలచిన ట్లయి పోతోంది— ఆ ఏడ్పు వినలేను—నాకు దారి కన పడడంలేదు.... "

"బాబూ...మనస్సు దిట్టపర్చుకోండి ... ఇవి లోకంలోని సామాన్యదృశ్యాలు ... నా చెయ్యి పట్టుకొని నడిచి రండి."

"... నాతల్లీ... నన్ను విడిచిపెట్టావే !"

"మళ్లీ ఆ కంఠం ! "

" బాబూ ! చాలా ఎరుగున్న ముఖాలుకూడా వున్నట్లున్నాయండీ... దీపాల వెలుగులో... "

" రామూ! ... నా గుండె బరువవుతోంది... ఆ కంఠం చూడు— ఆ కంఠంలో ఏదోపరిచితస్వరం వినపడుతోంది ... ఆ గుంపులోంచి ఒకపరిచిత హృదయం పిలుస్తోంది... రామూ ! రామూ ! "

"బాబూ ! కంగారుపడకండి...నన్ను గట్టిగా పట్టుకొని త్వరగా అడుగులు వెయ్యండి...మనం మరో నిమిషంలో పందిట్లో వుండాలి !

"అవును—అవును... రామూ ! ఆ కంఠం !"

"... నిన్ను — పసుపు బట్టలతో చూసే యోగ్యత నాకు లేకపోయిందే... నీ పెళ్లి ఈ చేతులతో చేసే యోగ్యత నాకు లేకపోయిందే... "

" బాబూ ! అలా గెక్కడికి వెడుతున్నారు ? ఆగండి—ఆగండి..."

"రామూ ! నన్నాపకు— అందులోంచి ఏదో ఆ ప్రేమహృదయం వినపడుతోంది— నన్ను పిలుస్తోంది—నేవెడతా... "

"... ఒక్క క్షణానికి పెళ్లి కావలసింది ఇలా గవుతుం దని—అయ్యో దేవుడా ! ఎంత అన్యాయం చేశావురా ! నా తల్లిని తీసుకు పోయావురా ! ..."

"బాబూ ! బాబూ ! "

"న న్నాపకు రామూ ! "

" పెళ్లిపందిట్లోనుంచే నిన్ను మోసుకు వెళ్లవలసి వచ్చిందే—తల్లీ— "

"రామూ ! ... అమ్మ—అమ్మ! ...ఆ కంఠం అమ్మ!! అమ్మా! అమ్మా ! ..."

"నీకోసం వెయ్యికళ్లతో వొచ్చే అన్న కేం చెప్పనే లక్ష్మీ— మమ్మల్నొదిలి— "

"అయ్యో:——నా చెల్లీ—నాముద్దు లక్ష్మీ!! అమ్మా! ... అమ్మా ! ... అయ్యో ! చెల్లీ...... చెల్లీ..."

" నాయనా! వొచ్చేవుట్రా బాబూ !

నీకోసం ఎంత ఏడ్చిందిరా నాయనా !

మన్ని వొదిలిపెట్టేసిందిరా ... బాబూ ... అంతా అయిపోయిందిరా... కన్నె పిల్లగానే కళ్లు మూసిందిరా... ! "

"అమ్మా ! ...అయ్యో చెల్లీ !...

"నిన్ను పెళ్లిపీటలమీద చూసేయోగ్యత నాకు లేకపోయినదే ! ... ఈ హారా లెవరి కింక ?... ఈ పద్యాలూ, ఈ కవిత్వాలూ ఎవరిమీద నింక ?...

"నా కలలన్నీ అబద్ధాలేనా? నా తత్వాలూ వేదాంతాలూ ఆఖరికి నిజా లయ్యాయా?? "ఆఖరికి నీమీద పద్యాలు రాసుకొనేందుకే నే నయ్యానా? నీమీద కృతులు పాడుకొనేందుకే నే మిగిలి వున్నానా? ? ......చెల్లీ !.... లక్ష్మీ ... ! పెళ్లి పీటలమీదనుంచే నిన్ను తీసుకుపోయాడా— దేవుడు !......"